## యువత సన్మార్గంలో నడవాలి



మాట్లాడుతున్న ఓఎస్డీ మాజీ ఎస్పీ మల్లారెడ్డి

నర్సాపూర్, జనవరి 4: యువత సన్మార్గంలో నడవాలని ఓఎస్డీ మాజీ ఎస్పీ మల్లారెడ్డి తెలిపారు. శనివారం నర్సాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కృషి విజ్ఞాన గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెరుగైన సమాజం కోసం యువకుల పాత్ర అనే అంశంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకుని ఆదర్శంగా నిలువాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగరాజు, కృషి విజ్ఞాన గ్రామీణ సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతం, సీఐ జాన్‌రెడ్డి పాల్గొన్నారు.

## టీఆర్టీఎఫ్ డైరీ ఆవిష్కరించిన కలెక్టర్



మెదక్ మున్సిపాలిటీ, జనవరి 4: టీఆర్టీఎఫ్ ఉపాధ్యాయ సంఘం 2025 డైరీని కలెక్టర్ రాహుల్‌రాజ్ కలెక్టరేట్‌లోని కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రణీద్‌కుమార్, ఐలయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల సర్వే పక్కాగా చేపట్టాలి



ఇండ్ల సర్వే పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ సాయిబాబా

కౌడిపల్లి, జనవరి 4: ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పక్కాగా చేపట్టాలని నర్సాపూర్ డివిజన్ డీఎల్‌పీవో సాయిబాబా సూచించారు. శనివారం కౌడిపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో కరీముల్లా, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

చిన్నశంకరంపేట, జనవరి 4: రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని కొర్విపల్లి శివారులో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ నుంచి నార్సింగ్‌కు మద్యం సీసాలు తీసుకుని బొలేరో వాహనం వెళ్తున్నది. కొర్విపల్లి శివారు వద్దకు రాగానే బొలేరో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. వాహనం వెనకాల వస్తున్న ఆటో, ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి బొలేరోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా క్షతగాత్రులను మెదక్ ఏరియా దవాఖానకు తరలించారు.


## సీబీఐలో డిజిటల్ సేవలు ప్రారంభం



సీబీఐని ప్రారంభిస్తున్న జోనల్ హెడ్ ధారాసింగ్‌నాయక్

రామాయంపేట, జనవరి 4: తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా సీబీఐ సేవలు విస్తరిస్తున్నామని సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా హైదరాబాద్ జోనల్ హెడ్ ధారాసింగ్ నాయక్ అన్నారు. శనివారం రామాయంపేటలో ఆయన సీబీఐ నూతన భవనంలోకి మార్చి ప్రారంభించారు. సీబీఐలో ఖాతాదారులకు విశిష్ట సేవలను బ్యాంకు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో వరంగల్ రీజియన్ మేనేజర్ కృష్ణమోహన్, రామాయంపేట బ్యాంకు మేనేజర్ భీముడు, కౌన్సిలర్లు దేమె యాదగిరి, గజవాడ నాగరాజు, సంతోష్, పబ్బ చంద్రం, లక్ష్మీపతి, శ్రీనివాసశర్మ, సత్యం తదితరులు ఉన్నారు.

## ధ్వజస్తంభ ఏర్పాటుకు విరాళం




చిలిపిచెడ్, జనవరి 4: మండలంలోని గౌతాపూర్‌లో హనుమాన్ ఆలయంలో ప్రతిష్ఠించనున్న ధ్వజస్తంభానికి రూ.2.20 లక్షల విరాళాన్ని అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వెంకటపతి సుగుణమ్మ అంజిరెడ్డి శనివారం అందజేశారు.

## వాహనాల బహిరంగ వేలం పాట

నర్సాపూర్, జనవరి 4: గంజాయి, అక్రమ మద్యం రవాణాకు సంబంధించి వివిధ నేరాల్లో స్వాధీనం చేసుకున్న నాలుగు వాహనాలను ఈ నెల 7న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ పద్మ పేర్కొన్నారు. నర్సాపూర్ ఆబ్కారీ స్టేషన్ వద్ద మెదక్ డివిజన్ సంగారెడ్డికి చెందిన ప్రొహిబిషన్, ఆబ్కారీ డిప్యూటీ కమిషనర్ ఆదేశానుసారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు వాహనాలను తనిఖీ చేసుకోవచ్చని సూచించారు.

## సైక్లింగ్‌తో ఆరోగ్యం



మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 4: ప్రతిఒక్కరూ నడకతో పాటు సైక్లింగ్ చేయాలని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ అన్నారు. శనివారం సిద్ధార్థ విద్యాసంస్థలు, హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో సైక్లింగ్ ర్యాలీ నిర్వహించారు. సైకిల్ నడిపితే శారీరకంగా, మానసికంగా ధృఢంగా ఉంటారని, రోడ్డుపై వెళ్లే సమయంలో ట్రాఫిక్ నియమాలను పాటించాలని ఆయన తెలిపారు. సైక్లింగ్‌లో పాల్గొన్న విద్యార్థులకు హెల్మెట్లు, బహుమతులను హైదరబాద్ సైక్లింగ్ గ్రూప్ సభ్యుడు కోటేశ్వర్‌రావు అందజేశారు. కార్యక్రమంలో సిద్ధార్థ విద్యాసంస్థల అధినేత శ్రీనివాస్ చౌదరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రతి గుంటకూ సాగు నీరందించాలి

- ఆరు గ్యారంటీలను గాలికి వదిలేసిన ప్రభుత్వం
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



బీ కొండాపూర్ చెరువులో నీరు వదులుతున్న ఎమ్మెల్యే



నామకరణ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, జనవరి 4: యాసంగిలో సాగులో ఉన్న ప్రతి గుంటకూ నీరందించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని మండిపడ్డారు. శనివారం మండలంలోని బీ కొండాపూర్ చెరువు తూము వద్ద పూలు చల్లి ప్రత్యేక పూజలు చేసి యాసంగి పంటలు వేసేందుకు సాగు నీటిని వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు రైతుల మేలు కోరి కేసీఆర్ ప్రాజెక్టులు కట్టించి, ఎండాకాలంలోనూ కాల్వల ద్వారా సాగు నీరందించారన్నారు. మల్లన్న సాగర్ జలాలను రైతులకు ఇవ్వకుండా హైదరాబాద్‌కు తరలించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదన్నారు. పంటలకు సరిపోయేంత నీరు వదలిన తరువాతే తీసుకుపోవాలన్నారు. కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వమని, రుణమాఫీ, రైతుభరోసా ఇవ్వలేడంలో విఫలమైందన్నారు.

**ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే..**

చేగుంట మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్ అన్న కుమారుడు వంశీ ప్రియాంకల కుమారుడి నామకరణ వేడుకలు నార్సింగిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.

**బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే**

జిల్లా మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు తోడుపునూరి రాజు తండ్రి లయన్స్ శంకరయ్య ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోమండ్ల నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, జిల్లా నాయకులు రంగయ్యగారి రాజిరెడ్డి, సుభాష్‌రెడ్డి, నాయిని రాజ్‌గోపాల్, మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, కొటారి అశోక్, పట్నం తానీషా, బుర్గు శ్రీనివాస్, బింగి గణేశ్, కాశబోయిన సుదర్శన్, శ్రీకాంత్, అలీ, డిష్‌రాజు, సురేశ్ ఉన్నారు.

# సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలి

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి సంఘీభావం
- పలువురికి ఎల్‌వోసీలు, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



మెదక్‌లో సమగ్ర శిక్ష ఉద్యోగులకు సంఘీభావం తెలుపుతున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

మెదక్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): మెదక్ కలెక్టరేట్ ఎదుట 26 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులకు బీఆర్‌ఎస్ తరపున నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి శనివారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన నెలలోపే సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తామని పీసీసీ హోదాలో రేవంత్‌రెడ్డి మాట ఇచ్చి ఇప్పుడు చిన్నచూపు చూడడం, అవహేళన చేస్తూ మాట్లాడటం బాధాకరమన్నారు. వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. కేసీఆర్ హయాంలో కాంట్రాక్ట్ వ్యవస్థ అనేది లేకుండా అందరిని క్రమబద్ధీకరణ చేశారని గుర్తు చేశారు. కలెక్టర్‌ల ద్వారా రోస్టర్, మెరిట్ పద్ధతి ద్వారా సమగ్ర శిక్షా ఉద్యోగులు ఎంపికయ్యారని గుర్తు చేశారు. కనీస వేతనం కల్పిస్తూ క్రమబద్ధీకరణ చేసేంతవరకు బీఆర్‌ఎస్ పార్టీ వారికి మద్దతుగా ఉంటుందని చెప్పారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యను అసెంబ్లీ మంత్రుల వద్ద సమస్యను వినిపిస్తానని చెప్పారు.

**ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే**

నర్సాపూర్, జనవరి 4: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన ఉప్పుల మల్లేశ్ హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ నిమిత్తం రూ.2 లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. లింగాపూర్ మాజీ సర్పంచ్ అశోక్, బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మీనర్సయ్య, విఠల్, లింగం, పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

**శివ్వంపేటలో..**

శివ్వంపేట, జనవరి 4: ప్రభుత్వం అందించే ఎల్‌వోసీతో నిరుపేదలకు ఆర్థిక భరోసా కలుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని పెద్దగొట్టిముక్ల గ్రామానికి చెందిన జే.రిషి అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ నిమిత్తం మంజూరైన రూ.లక్ష ఎల్‌వోసీని ఎమ్మెల్యే బాధిత కుటుంబానికి అందజేశారు. ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచ్ చంద్రకళ శ్రీశైలంయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

**సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత**

చిలిపిచెడ్, జనవరి 4: ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయనిధి వరంలాంటిదని ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాయలంలో బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేశారు. చిలిపిచెడ్ మండలం గౌతాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు అనారోగ్యంతో మృతి చెందాడు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.60వేలు, అదే గ్రామానికి చెందిన చాకలి విఠల్‌కు రూ.39 వేలు, చిలిపిచెడ్ గ్రామానికి శంకరయ్యకు రూ.82వేల చెక్కులను ఎమ్మెల్యే మాజీ సర్పంచ్ దుర్గారెడ్డికి అందజేశారు.

## పది పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- రోజూ ప్రత్యేక తరగతులు నిర్వహించాలి
- డీఈవో రాధాకిషన్



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న డీఈవో రాధాకిషన్

రామాయంపేట, జనవరి 4: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. శనివారం మండలంలోని డి.ధర్మారం గ్రామంలో జడ్పీహెచ్‌ఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు సబ్జెక్టుల వారీగా చదువాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ప్రతి ఉపాధ్యాయుడు రోజూ పాఠశాలకు హాజరుకావాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు ఎప్పటికప్పుడు పరీక్షించాలని, ప్రత్యేక క్లాసుల్లో స్నాక్స్ అందజేయాలని సూచించారు.

**సోషల్ టాలెంట్ టెస్ట్‌లు ఉపయోగపడుతాయి**

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 4: నాణ్యమైన విద్యను అందించడానికి, పర్యావరణ పరిరక్షణకు సోషల్ టాలెంట్ టెస్ట్‌లు ఉపయోగపడుతాయని డీఈవో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో తెలంగాణ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ ఫోరం అధ్యక్ష కార్యదర్శులు నర్సింలు, ప్రభాకర్, రవిబాబు, సిద్ధిరాములు, దేవీసింగ్, శివరాజ్, కృపాకర్ రెడ్డి, సత్యనారాయణ, ఉపాధ్యాయ సంఘాల నేతలు దేవయ్య, లక్ష్మణ్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

**చిన్నశంకరంపేటలో..**

చిన్నశంకరంపేట, జనవరి 4: సాంఘికశాస్త్రంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన ప్రతిభ పోటీలో చిన్నశంకరంపేట ఆదర్శ పాఠశాల విద్యార్థిని కావేరి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈనెల 20న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పరీక్షలో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ వాణికుమారి తెలిపారు. విద్యార్థి కావేరి, ఉపాధ్యాయుడు లింగయ్యను డీఈవో రాధాకిషన్ అభినందించారు.

## సీఈఐఆర్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలి: తూప్రాన్ డీఎస్పీ




బాధితులకు ఫోన్లు అందజేస్తున్న తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ జాన్‌రెడ్డి

నర్సాపూర్, జనవరి 4: ఫోన్లు పోగొట్టుకున్నా లేక చోరీకి గురైనా బాధితులు సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుని తిరిగి పొందవచ్చని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి సూచించారు. శనివారం నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 25 మంది సెల్‌ఫోన్ బాధితులను గుర్తించి డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ జాన్‌రెడ్డి వారికి సెల్‌ఫోన్లు అందజేశారు. వారితో పాటు కౌడిపల్లి ఎస్సై రంజిత్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

**రికవరీ అయిన ఫోన్లు అందజేత**

పాపన్నపేట,జనవరి04: పెల్‌పోన పోయినా,చోరీకి గురైన వెంటనే స్థానిక ఠాణాలో తక్షణం ఫిర్యాదు చేయాలని ఎస్సైశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఇటీవల వివిధ ప్రాంతాలలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న మండలానికి చెందిన నలుగురు బాధితులకు పోన్లు సీఈఐఆర్ వైబ్‌సైట్ ద్వారా రికవరీ చేసినట్లు తెలిపారు. శనివారం ఠాణాలో సంబంధితులకు చరవాణీలు అందజేశారు.
తదితరులు ఉన్నారు.

**నిజాంపేటలో..**




నిజాంపేట, జనవరి 4: నందిగామ గ్రామానికి చెందిన లద్ద ప్రభాకర్ మూడు రోజుల క్రితం పొలం వద్దకు వెళ్తుండగా మార్గమధ్యలో ఫోన్ పోగొట్టుకున్నాడు. సీఈఐఆర్ వెబ్సైట్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్‌ను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి బాధితుడికి ఫోన్ అందజేశారు.

## సొసైటీని గోమారంలోనే కొనసాగించాలి



విలేకరులతో మాట్లాడుతున్న రైతులు

శివ్వంపేట, జనవరి 4: రైతుల శ్రేయస్సు కోసం గోమారంలో ప్రారంభించిన సొసైటీని ప్రభుత్వం కొనసాగించాలని రైతులు, ఖాతాదారులు శనివారం డిమాండ్ చేశారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి మాట్లాడుతూ 1963లో వంద మంది ఖాతాదారులతో విశాల పరపతి సంఘం పేరుతో గోమారంలో రైతులు బ్యాంకు ఏర్పాటు చేసుకున్నారన్నారు. గోమారం, నవాబ్‌పేట, సికింద్లాపూర్, పెద్దగొట్టిముక్ల, చెన్నాపూర్, చండి, బిజిలీపూర్, గంగాయిపల్లి, పరికిబండ, ప్రస్తుత గుమ్మడిదల మండలం కానుకుంట, కొత్తపల్లి రెవెన్యూ గ్రామాలకు చెందిన రైతులు సభ్యులుగా ఉన్నారన్నారు. 1987లో ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలో సహకార సంఘాలు ఏర్పాటు చేయడంతో విశాల పరపతి సంఘం కాస్త గోమారం కో ఆపరేటీవ్ బ్యాంకుగా అవతరించిందని గుర్తు చేశారు. చంద్రబాబు హయాంలో పీఏసీఎస్‌కు 2004లో సొంత భవనం నిర్మించారన్నారు. ఈ బ్యాంకును శివ్వంపేట సొసైటీలో కలిపారన్నారు. రైతుల శ్రేయస్సు కోసం దీన్ని తిరిగి ప్రారంభించాలని కోరారు.

## బాలికపై లైంగిక దాడి

వెల్దుర్తి/ చేగుంట, జనవరి 4: ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి చొరబడిన ఇద్దరు యువకులు బాలికపై లైంగిక దాడి చేసిన ఘటన మాసాయిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నడిమితండాలో శుక్రవారం రాత్రి జరిగింది. చేగుంట ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నడిమితండాలోని ఓ ఇంట్లో ఎవరూ లేకపోవడం, బాలిక ఒక్కరే ఉండడాన్ని గమనించిన అదే తండాకు చెందిన యువకుడితో పాటు చెట్లతిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన మరో యువకుడు కలిసి ఇంట్లోకి వెళ్లి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారు. ఒంటరిగా ఉన్న మైనర్ బాలికపై దాడికి పాల్పడిన విషయాన్ని తెలుసుకున్న ఇరుగు పొరుగు వారు చేగుంట పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు తండాకు చేరుకుని, పరిస్థితిని గమనించి, బాలిక ఫిర్యాదు మేరకు ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లిన కారు



పొలంలోకి దూసుకెళ్లిన కారు

శివ్వంపేట, జనవరి 4 : అదుపుతప్పి కారు వరిపొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన శివ్వంపేట మండలం పాంబండ సబ్ స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం తూప్రాన్ – నర్సాపూర్ ప్రధాన రహదారి నుంచి ఉసిరికపల్లి చౌరస్తా మీదుగా పోతులబోగూడ చౌరస్తా వరకు డబుల్ రోడ్డుపనులు పనులు జరుగుతుండగా వెల్దుర్తి మండల కేంద్రంలో శ్రీలక్ష్మీ నర్సింగ్ హోమ్ నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీకాంత్ గౌడ్, డాక్టర్ లక్ష్మీ దంపతులు కారులో వెల్దుర్తి నుండి ఉసిరికపల్లి వైపు కారులో వస్తున్నారు. ఈ క్రమంలో పాంబండ సబ్‌స్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి వరిపొలంలోకి దూసుకెళ్లింది. ప్రమాద ఘటనను గమనించిన స్థానికులు వెంటనే కారును బురదలో నుండి బయటకు తీసి కారులో ఉన్న శ్రీకాంత్‌గౌడ్ దంపతులను బయటకు తీశారు. స్వల్ప గాయాలతో బయటపడ్డ బాధితులను వెల్దుర్తిలోని ప్రైవేట్ దవాఖానకు తరలించినట్లు స్థానికులు తెలిపారు. గత కొన్ని రోజుల క్రితమే కారు అదుపుతప్పి ఏడుగురి ప్రాణాలు పోయిన విషయం విధితమే. రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయకపోవడంతోనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలని స్థానికులు అంటున్నారు.

## ఎంపీ రఘునందన్ రావును కలిసిన టీఎన్జీవోలు

మెదక్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఎంపీ రఘునందన్ రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు దొంత నరేందర్, కార్యదర్శి మినికి రాజ్ కుమార్ మర్యాదపూర్వకముగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## సహకార సంఘం ఏర్పాటు చేయాలి

చిలిపిచెడ్, జనవరి 4: మండలంలోని 19 గ్రామ పంచాయతీలు కలిపి సోమక్కపేట సహకార సంఘం ఒక్కటే ఉన్నదని, దాని నుంచి ఐదు గ్రామాలతో మరో సొసైటీ ఏర్పాటు చేయాలని నర్సాపూర్ నియోజకర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి అవుల రాజిరెడ్డికి కలిసి అజ్జమర్రి మాజీ సర్పంచ్ పరశురాంరెడ్డి, మండల మాజీ వైస్ ఎంపీపీ విశ్వంభర స్వామి వినతి పత్రం అందజేశారు. శనివారం ఫైజాబాద్, బండపోతుగల్, అజ్జమర్రి, గంగారం, జగ్గంపేటలను కలుపుతూ మరో సంఘం ఏర్పాటుకు కృషి చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, నగేశ్, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

**చేరికుంట తండాను పంచాయతీ ఏర్పాటు చేయాలి**

మండలంలోని ఫైజాబాద్ గ్రామ పంచాయతీలోని తౌర్య తండా, ఎలుగుట్ట తండా, తుల్చ తండా, కొత్తకుంట తండాలను కలుపుతూ నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డికి గిరిజనలు, నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు శివాజీ నాయక్, వీరేశం పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల వినూత్న నిరసన



బిచ్చమెత్తుకుంటూ పారిశుధ్య కార్మికుల నిరసన

రామాయంపేట, జనవరి 4: తమకు జీతాలు రాక ఐదు నెలలు కావస్తున్నదని, తాము బతికేదెట్లా అంటూ పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం మండలంలోని డి.ధర్మారం గ్రామంలో పారిశుధ్య కార్మికులు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ప్రభుత్వం తమకు జీతాలు ఇవ్వాలని, లేకుంటే తమ బతుకులు బజార్లో పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## రైతుల పక్షాన ప్రభుత్వం నిలబడాలి

నర్సాపూర్, జనవరి 4: ఢిల్లీ సరిహద్దుల్లో వివిధ రాష్ట్రాల రైతులు చేస్తున్న ధర్నాలకు రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి మద్దతు తెలపాలని రైతు రక్షణ సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు మైసయ్య యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం నర్సాపూర్‌లో ఆర్డీవో మహిపాల్‌కు నాయకులు వినతి పత్రం అందజేశారు. పంటలకు చట్టబద్ధతతో కూడిన న్యాయమైన ధర నిర్ణయించడం ఒక్కటే మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎమ్ఎస్‌పీ నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమితి జిల్లా ముఖ్య సలహాదారుడు చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి రమేశ్ యాదవ్ పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ

వెల్దుర్తి, జనవరి 4: మద్యం సేవించి, నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని వెల్దుర్తి ఎస్సై రాజు అన్నారు. శనివారం వెల్దుర్తితో పాటు పట్టణ శివారులో ప్రత్యేక బృందాలు, పోలీస్ సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్, వాహనాల తనిఖీలు చేపట్టారు. హెల్మెట్, వాహన పత్రాలు లేని పలువురికి చలాన్లు విధించారు.

**నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్**

మెదక్ అర్బన్, జనవరి 4: జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తా వద్ద ఆర్ఎస్సై భవానీకుమార్ క్యూఆర్టీ ఆధ్వర్యంలో శనివారం వెహికల్ చెకింగ్‌లో భాగంగా నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేసి జరిమానా విధించారు. వాహనదారులు ఒరిజినల్ పత్రాలు చూపించి తమ వాహనానికి నంబర్ ప్లేట్ అతికించిన తర్వాత ఎవరి వాహనాలు వారికి తిరిగి ఇచ్చారు.

## రేగోడ్ మండలానికి 108 వాహనం

రేగోడ్, జనవరి 4: మండల కేంద్రానికి అత్యవసర సేవలు అందించేందుకు 108 అంబులెన్స్ వచ్చింది. దీంతో మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.108 రావడానికి కృషి చేసిన వారికి ప్రత్యేకధన్యవాదాలు తెలిపారు.

## గుండె పోటుతో మాజీ సర్పంచ్ మృతి



ఆది లక్ష్మణ్ (ఫైల్)

చేగుట, జనవరి 4: మండలంలోని బోనాల మాజీ సర్పంచ్ ఆది లక్ష్మణ్(60) శుక్రవారం రాత్రి గుండె పోటుతో మృతి చెందాడు. ఆ యన రెండు పర్యాయాలు సర్పంచ్‌గా ప్రజలకు సేవలందించాడు. లక్ష్మణ్ మృతిపై దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

## డాక్యుమెంట్ కాపీలు అందజేయాలి

నర్సాపూర్, జనవరి 4: ఉమ్మడి మెదక్ జిల్లా ఖోఖో అభిమానులు మండలాల వారీగా అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడాకారులతో క్లబ్‌లు, సొసైటీలు, రిజిస్ట్రేషన్ చేయించిన డాక్యుమెంట్ కాపీలను ఈ నెల 7వ తేదీ లోపు అడహక్ కమిటీ సభ్యుడు నాగరాజుకు అందజేయాలని కన్వీనర్ మహేందర్‌రావు ప్రకటనలో కోరారు. వివరాలకు 9866546563 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

## ఏటీఎం వద్ద దృష్టి మరల్చి రూ.42 వేలు చోరీ

తూప్రాన్, జనవరి 4: ఏటీఎం వద్ద రైతు దృష్టి మరల్చి రూ.42 వేలను గుర్తు తెలియని వ్యక్తి కాజేసిన ఘటన తూప్రాన్‌లో జరిగింది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం... దాతర్‌పల్లి గ్రామానికి చెందిన రైతు చింతల శ్రీనివాస్ శనివారం మధ్యాహ్నం తూప్రాన్‌లోని ఎస్‌బీఐలో తన ఖాతాలో పడిన ధాన్యం డబ్బులు విత్‌డ్రా చేసుకోవడానికి వెళ్లాడు. డబ్బులు డ్రా చేయడానికి ప్రయత్నించగా రాకపోవడంతో పక్కనే గల గుర్తు తెలియని వ్యక్తికి తన ఏటీఎం ఇచ్చి డబ్బులు డ్రా చేసి ఇవ్వమని అడిగాడు. డ్రా చేస్తున్నట్లు ప్రయత్నించి డబ్బులు రావడం లేదని, వేరే ఏటీఎం కార్డు ఇచ్చి వెళ్లిపోయాడు. విషయం తెలియని రైతు శ్రీనివాస్ పక్కనున్న ఏటీఎంలో డబ్బులు డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా ఆ ఏటీఎం తనది కాదని తెలిసింది. వెంటనే తన అకౌంట్ బుక్ ద్వారా బ్యాంకులో బ్యాలెన్స్ చెక్‌చేసుకోగా రూ. 42 వేలు మాయమైనట్లు తెలిసింది. డబ్బులు డ్రా చేసుకున్న ఆగంతకుడిని పట్టుకుని చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

## మహిళ హత్య కేసులో వ్యక్తికి రిమాండ్

మనోహరాబాద్, జనవరి 4: మహిళ హత్య కేసులో ప్రియుడే కాలయముడయ్యాడు. తూప్రాన్ సీఐ రంగ కృష్ణ మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బీహర్ రాష్ట్రానికి చెందిన సూరజ్ కుమార్ చంద్ర వంశీ ముజఫర్‌పూర్‌లో ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. రజనీ దేవీతో పరిచయం ఏర్పడింది. అది వివాహేతర సంబంధానికి దారి తీసింది. దీంతో ఇద్దరు ముజఫర్‌పూర్‌లో సహజీవనం కొనసాగించారు. సూరజ్ కుమార్ చంద్ర వంశీకి 2015లోనే నీతూ దేవితో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సూరజ్ రజనీదేవితో కలిసి గతేడాది కాళ్లకల్ వచ్చి, శివారులోని గీతా ప్యానెల్ ప్రోడక్ట్స్ కంపెనీలో పనికి కుదిరారు. గతేడాది నవంబర్ 11న కిరాణా వస్తువులతో పాటు మద్యం తీసుకుని అద్దె గదికి వెళ్లారు. మద్యం సేవిస్తూ రజినీ దేవిని డబ్బులు ఇవ్వమని అడిగాడు. డబ్బుల విషయంలో గొడవలు జరగడంతో తాను మరొకరితో కలిసి ఉంటానని రజినీదేవి చెప్పడంతో కోపోద్రిక్తుడైన అతడు ఆమెను చంపి డబ్బులు తీసుకోవాలనుకున్నాడు. స్నేహంగా నటిస్తూ, ఆమె చున్నీని గొంతుకు చుట్టి ఊపిరాడకుండా చేసి చంపేశాడు. అనంతరం ఆమె జీతం డబ్బుల నుంచి రూ.7 వేలు దొంగిలించి తాళం వేసి పారిపోయాడు. ఈనెల 3న నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
PLOT FOR SALE
★ Siddipet Town 150 yards Plot Sale: Near Govt. Degree College in Prashant Nagar Colony, Opposite Adarsha Vidhyaniketan School. 9396677876.
NT-338994
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.